





నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I హైదరాబాద్, సోమవారం 3 జూన్ 2024 SANGAREDDY







# ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

- సంగారెడ్డి కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 2: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 వసంతాలు పూర్తి చేసుకొని 11వ వసంతంలోకి అడుగిడుతూ ఉత్సాహ వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. ఆదివారం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ వల్లూరు క్రాంతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అమరుల ఆశయాలు, ఆకాంక్షల మేరకు రాష్ట్రా న్ని, జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన శాసన సభ, లోక్‌సభ ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడంలో, అధిక సంఖ్యలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోడంలో జిల్లా యంత్రాంగానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, అన్ని స్థాయిల ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు కలెక్టరేట్ ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి వందన సమర్పణ చేశారు. అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామనే నినాదంతో ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలను సందర్శించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శలను తిలకించి వారికి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారులు


స్టాల్‌ను తిలకిస్తున్న కలెక్టర్


సాంస్కృతిక కళా ప్రదర్శన



సంగారెడ్డిలో జాతీయ పతాకం ఆవిష్కరించి జెండా వందనం చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, పాల్గొన్న ఎస్పీ రూపేశ్, హాజరైన ప్రముఖులు











